క్లుప్తంగా

శ్రీనివాసుడికి చందనోత్సవం



చందనం అలంకరణలో శ్రీనివాసుడు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గ్రామంలో ఉన్న భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని దేవాలయంలో శ్రీనివాసుడికి శుక్రవారం చందనోత్సవం నిర్వహించారు. వైశాఖ శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవాలయ అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు, రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, చందనంతో అలంకరించారు. కనులపండుగగా నిర్వహించిన ఈ ఉత్సవంలో దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

వేలం వాయిదా

నెల్లిమర్ల: పట్టణంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) స్టేషన్ వద్ద శుక్రవారం నిర్వహించాల్సిన ద్విచక్ర వాహనాల వేలం వాయిదా వేసినట్లు సీఐ జీఎస్ రాజశేఖరనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, వివిధ దాడుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాల వేలాన్ని అనివార్య కారణాల వల్ల ఈ నెల 9వ తేదీకి వాయిదా వేసినట్లు చెప్పారు. ఆసక్తి గల వారు ఆ రోజున స్టేషన్ వద్ద జరగనున్న వేలంలో పాల్గొనాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

పూసపాటిరేగ: మండలంలోని రీసుపేటకు మంజూరైన అంగన్‌వాడీ కేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మొంగం నాగబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎంతో కాలంగా గ్రామానికి అంగన్‌వాడీ కేంద్రం లేదని.. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చొరవతో కేంద్రం మంజూరైందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొయ్య ఎల్లన్నరెడ్డి, సర్పంచ్ కొయ్య సన్యాసమ్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మహాయజ్ఞంలో పాల్గొనాలి

విజయనగరం టౌన్: దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి 17 వరకు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే అష్టోత్తర శతకుండాత్మక మహాయజ్ఞంలో జిల్లాకు చెందిన భక్తులు పాల్గొనాలని దేవదాయశాఖ జిల్లా సహాయక కమిషనర్ కేఎల్.సుధారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ పరిరక్షణార్థం, రాష్ట్ర ప్రజల శాంతి సౌభాగ్యాలకు, పాడి పంటల సమృద్ధికి ప్రభుత్వం యాగం నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భోగాపురం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో వచ్చేనెల 11న నిర్వహించనున్న 6వ తరగతి ప్రవేశ పరీక్షకు సంబంధించి ఈ నెల పదో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ పార్వతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1, 2013 ఆగస్టు 31 మధ్య.. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులు 2009 సెప్టెంబర్ 1, 2013 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నిరవధికంగా 2021 – 22, 2022 – 23 విద్యా సంవత్సరాలు చదివి ఉండాలన్నారు. 2022 – 23 విద్యా సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్ పొంది ఉండాలని తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి..

నెల్లిమర్ల: పట్టణంలోని పాత రెవెన్యూ కార్యాలయానికి వెళ్లే దారిలోనున్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం కర్రి సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించి 3 నుంచి 9వ తరగతి వరకు తెలుగు మీడియంలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ కులాలకు చెందిన బాలురకు మాత్రమే ప్రవేశాలు కల్పిస్తామన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా తెలుపు రంగు రేషన్‌కార్డు కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు. అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన కిట్లు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 79891 68622 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

శేషగిరి మాస్టారు పోరాటాలు మరువలేనివి

బొబ్బిలి: విద్యారంగ పరిరక్షణకు శేషగిరి మాస్టారు చేసిన పోరాటాలు మరువలేనివని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు అన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శేషగిరి మాస్టారు వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్. గోపాలం, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఎస్. శివ, కె. మణికుమార్, బి. తేజ, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు..అనూహ్య స్పందన

● జొన్నవలసలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



ప్రభుత్వ పాలనపై డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ఎదుట సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారు

విజయనగరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. మండలంలోని జొన్నవలసలో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొనగా గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లు, మంగళహారతులతో స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల గ్రామంలో ఉన్న మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు తీరును వివరిస్తూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలతో ఆనందంగా ఉన్నామని, సుఖసంతోషాలతో జీవిస్తున్నామని తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో మరలా వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేస్తామని మాటిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి అవినీతి, లంచగొండితనం లేని పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పారదర్శక పాలన అందిస్తున్నారని చెప్పారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించడమే ఇందుకు తార్కాణమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, సర్పంచ్ కంది రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు కంది గణపతిరావు, కె.నర్సింగరావు, మండల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి మండల సమస్యలు

● ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి

భోగాపురం: అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు శంకుస్థాపనకు ఇటీవల మండలానికి వచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి మండలంలోని పలు సమస్యలను తీసుకెళ్లినట్లు ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2019 మధ్య ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఇప్పటివరకు బిల్లులు రాలేదని.. అలాగే 2019 నుంచి ఇప్పటివరకు 287 మంది ఇళ్లు పూర్తి చేసుకున్నా బిల్లులు మంజూరు కాని విషయాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా బైరెడ్డిపాలెం పంచాయతీలో అర్హులైన సుమారు 80 మంది లబ్ధిదారులను గుర్తించామని, అయితే సచివాలయ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి లేనందున సచివాయాలనికి సమీపంలో గూడెపువలస రెవెన్యూ పరిధి సర్వే నంబర్ 111లో ఉన్న 2.50 ఎకరాల ప్రభుత్వ స్థలంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. నందిగాం పంచాయతీలో సచివాలయం, ఆర్‌బీకే ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. సముద్రతీర ప్రాంతమైన ముక్కాం గ్రామంపై ఉవ్వెత్తున సముద్ర కెరటాలు ఎగసిపడుతుండడంతో సీసీ రోడ్డుతో పాటు గృహాలు కోతకు గురవుతున్నందున అక్కడ రక్షణగోడ నిర్మించాలని కోరినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు.

మన్యం వీరుడు అల్లూరి వర్ధంతి రేపు



మాట్లాడుతున్న అల్లూరి సేవా సమితి ప్రతినిధులు

విజయనగరం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి ఈ నెల 7న నిర్వహించనున్నట్లు అల్లూరి సేవాసమితి ప్రతినిధులు వెల్లడించారు. సమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక బాబామెట్ట దేవీపార్క్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రతినిధులు మాట్లాడుతూ, అల్లూరి వర్ధంతి సందర్భంగా స్థానిక దాసన్నపేట రైతుబజార్ జంక్షన్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం దగ్గర వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొంటారని, ప్రజలందరూ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు కేఏ ప్రసాద్ రాజు, సాగి శివాజీరాజు, జి. రామరాజు, గాదం మురళీ సూర్యనారాయణరాజు, అల్లూరి శివవర్మ, బాలాజీ, జీఎస్ఎన్ రాజు, చిట్టెల్ల రాంబాబు, కేఆర్‌కే రాజు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

విజయనగరం: నగరంలోని అయ్యన్నపేట అయ్యన్నకోనేరు వద్ద కొలువైన చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో(శివాలయం) విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ముఖ్య అతిథిగా క్రతువులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోలగట్లకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, మన సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణకు, దైవ కార్యక్రమాలకు ఎప్పుడూ తనవంతు సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం ఈ మహోత్సవానికి విరాళం అందించిన కోలగట్ల వీరభద్రస్వామికి సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లెంక సత్యం, మహేష్, సైలాడ ఈశ్వరరావు, కర్రోతు బంగారునాయుడు, విశ్వనాథం, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన తప్పనిసరి

● రెడ్‌క్రాస్ వైద్యుడు వేణుగోపాల్ రెడ్డి



ప్రథమ చికిత్సపై శిక్షణ ఇస్తున్న డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి

విజయనగరం ఫోర్ట్: ప్రథమ చికిత్సపై అవగాహన తప్పనిసరని రెడ్‌క్రాస్ వైద్యుడు వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్‌లో ప్రథమచికిత్సపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అగ్ని ప్రమాదంలో గాయాలైనప్పుడు ఏవిధంగా ప్రథమ చికిత్స చేయాలి, పాము కాటుకు గురైనప్పుడు, గుండె నొప్పి వచ్చినప్పుడు చేయాల్సిన సీఆర్‌పీ చేయు విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

వేసవి టెన్నిస్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం



శిక్షణకు హాజరైన చిన్నారులతో సిటీక్లబ్ ప్రతినిధులు

విజయనగరం: క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నగరంలోని సిటీక్లబ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేసవి టెన్నిస్ క్రీడా శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. సిటీ క్లబ్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించిన శిబిరంలో 30 మంది బాల, బాలికలు పాల్గొన్నారు. వీరికి కోచ్ పి. గౌరీశంకర్ ఆధ్వర్యంలో పలువురు సీనియర్ క్రీడాకారులు శిక్షణలో నేర్చుకోవాల్సిన మెలకువలపై సూచనలు చేశారు. ఈ నెల 30వ తేదీ వరకు ఉదయం 5 గంటల నుంచి 8 వరకు.. సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు నిర్వహిస్తామని క్లబ్ కార్యదర్శి రంగారావు దొర, తదితరులు తెలిపారు.

8న మహిళా పార్క్ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మహిళల కోసం ప్రత్యేకంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పార్క్‌ను ఈ నెల 8న ప్రారంభించనున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, పర్యాటక శాఖా మంత్రి ఆర్కే రోజా ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం తన నివాసం వద్ద వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జులు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎనిమిదో తేదీ సాయంత్రం సుమారు 6 వేల మంది మహిళలతో ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. పార్క్ ప్రారంభోత్సవం యావత్ ఆంధ్ర రాష్ట్రం మనవైపు చూసేలా నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. మహిళలు ఆనందంగా గడిపేందుకు, ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు పార్క్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ ముఖ్య నాయకులు కోలగట్ల కృష్ణారావు, సంగంరెడ్డి బంగారునాయుడు, ఈశ్వర్‌కౌశిక్, బొద్దాన అప్పారావు, రెడ్డి గురుమూర్తి, పలువురు కార్పొరేటర్లు, ఆయా డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, యువజన అధ్యక్షులు పాల్గొన్నారు.



హాజరైన పార్టీ నాయకులు, కార్పొరేటర్లు

విత్తనాలు, ఎరువుల సరఫరాకు ముందస్తు ప్రణాళికలు



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు రామారావు, తదితరులు

బాడంగి: మండలంలోని రైతులందరికీ ఖరీఫ్ సీజన్‌కు అవసమైన విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు వ్యవసాయశాఖ సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్‌బీకేలో జరిగిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులకు ఏమేరకు విత్తనాలు, ఎరువులు అవసరమో గుర్తించి ఇండెంట్ పెట్టాలన్నారు. ఏఓ శిరీష మాట్లాడుతూ, పీఎం కిసాన్ 14 విడత ఆర్థికసహాయం పొందాలంటే ఈనెల 15వ తేదీలోగా ఈకేవైసీ చేసుకోవాలని కోరారు. కౌలు రైతులు వీఆర్‌ఓల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించాలన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

బోరుబావులకు మరమ్మతులు



క్రాస్‌ప్రొగ్రాం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి

భోగాపురం: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పాడైన బోరుబావులకు మరమ్మతులు చేపడుతున్నట్లు మండల పరిషత్ అధ్యక్షురాలు ఉప్పాడ అనూషారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద క్రాస్‌ప్రొగ్రాం వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలోని వివిధ పంచాయతీల్లో ఉన్న 645 తాగునీరు బోర్ల మరమ్మతులకు సుమారు ఐదు లక్షల రూపాయల ఎంపీపీ నిధులతో మెటీరియల్ కొనుగోలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, మత్స్యశాఖ డైరెక్టర్ నరసింహులు, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హేమంత్‌కుమార్, ఏపీఓ ఆదిబాబు, ఏపీఎం రమణ, కొండపు రాజారెడ్డి, పి. గోపి, ఆళ్ల ముకుందరావు, తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేతో ఎంతో మేలు



కాగాంలో ప్రారంభించిన డ్రోన్‌సర్వే

● జెడ్పీటీసీ సభ్యురాలు లూర్థు

తెర్లాం: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష పథకంలో భాగంగా చేపడుతున్న భూముల రీసర్వే వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు గర్బాపు లూర్థు అన్నారు. మండలంలోని కాగాం గ్రామంలో తహసీల్దార్ డోల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రోన్ సర్వేను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఏళ్ల తరబడి ఉన్న భూ సంబంధిత సమస్యలన్నీ రీసర్వేతో పరిష్కారమవుతాయన్నారు. రైతులంతా సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. తహసీల్దార్ రాజేశ్వరరావు మాట్లాడుతూ, గ్రామంలో డ్రోన్ సర్వే ద్వారా అన్ని రకాల భూముల చిత్రాలు, మ్యాప్‌ను ముందుగా గుర్తిస్తామన్నారు. వీటి ద్వారా భూముల సరిహద్దులు గుర్తించడం, హద్దు రాళ్ల పాతడం జరుగుతుందని తెలిపారు. సర్పంచ్ మాదాసి లక్ష్మీశేషగిరి మాట్లాడుతూ, భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటరమణ, సర్వే ఆఫ్ ఇండియా సర్వేయర్లు, గ్రామ పెద్దలు, వీఆర్‌ఓ, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం



మహిళా సంఘాల సభ్యులకు పెరటికోళ్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రాజాం సిటీ: మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ లావేటి సులోచన, జెడ్పీటీసీ బండి నర్సింహులు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు పెరటి కోళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలంతా ఆర్థికశక్తిగా ఎదిగేందుకు ప్రభుత్వం అనేక పథకాల ద్వారా ప్రోత్సహిస్తోందన్నారు. పెరటి కోళ్ల పెంపకం ద్వారా స్వయంశక్తి సంఘాల మహిళలు జీవనోపాధి మరింతగా మెరుగుపర్చుకోవాలన్నారు. మదర్ పౌల్ట్రీ యూనిట్ ఏర్పాటుపై ఆసక్తి ఉన్న వారికి స్త్రీనిధి, సీఐఎఫ్ ద్వారా రుణాలు కూడా మంజూరు చేయనున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు సామంతుల అరుణ, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, పశుసంవర్ధక శాఖ ఏడీ బొత్స జయప్రకాష్, ఏపీఎంలు టి.దదికుమార్, హేమలత, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: స్థానిక వైకేపీ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు 35 యూనిట్ల పెరటికోళ్లను జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు చేతులమీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఏపీఎం సీతారాం మాట్లాడుతూ ఒక్కో యూనిట్ ఖరీదు రూ.2,700 అని ఒక్కో యూనిట్‌లో పదికోళ్లు ఉంటాయన్నారు. వీటి పెంపకం ద్వారా స్వయం ఉపాధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గండ్రేటి కేసరి, ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక విధానాలను తిప్పికొట్టాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

● పీడీఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

విజయనగరం పూల్‌భాగ్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను తిప్పికొట్టడం వల్ల ప్రభుత్వ రంగాలను రక్షించుకోవచ్చని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. యూటీఎఫ్ నాయకుడు కోరెడ్ల శేషగిరి మాస్టారు ద్వితీయ వర్ధంతి సందర్భంగా స్థానిక జెడ్పీ సమావేశంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'భారత రాజ్యాంగం, సంస్కరణలు, సామాజిక న్యాయం' అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో షేక్ బుకారీబాబు, డి.ఈశ్వరరావు, మోహనరావు, డి. రాము, కె. విజయగౌరి, రమేష్ చంద్రపట్నాయక్, సత్యశ్రీనివాస్, అప్పలనాయుడు, జేఏవీఆర్‌కే ఈశ్వరరావు, పార్వతి, తమ్మినేని సూర్యనారాయణ, కె సురేష్ పాల్గొన్నారు.

3డీ ప్రింటింగ్ కోర్సుతో ఉపాధి అవకాశాలు



వర్క్‌షాపులో పాల్గొన్న అతిథులు, యూనివర్సిటీ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: మెకానికల్ ఇంజినీరింగ్‌కు సంబంధించిన 3డీ ప్రింటింగ్ కోర్సుతో ఉపాధి అవకాశాలు అధికమని, దీనిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సెంచూరియన్ యూనివర్సిటీ మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌వీఎస్‌కే దీపక్‌కుమార్ అన్నారు. గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో '3డీ ప్రింటింగ్' పై శుక్రవారం జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ, 3డీ విధానం వెనుక ఉన్న సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు అవగాహన ఏర్పరచుకోవాలని సూచించారు. అనంతరం 3డీ ప్రింటింగ్‌ను ప్రయోగాత్మకంగా విద్యార్థుల ఎదుట చేసి చూపించారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటలక్ష్మి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ నిర్వహణ మెరుగుపరచాలి



కలెక్టరేట్ సెక్షన్‌లో తనిఖీ చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాలను, ప్రాంగణాన్ని కలెక్టర్ నాగలక్ష్మి .ఎస్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. నిర్వహణ మరింత మెరుగు పర్చాలని, అడ్డదిడ్డంగా పెరిగిన చెట్లను తొలగించాలని సిబ్బందిని సూచించారు. కలెక్టరేట్ పరిపాలనా కార్యాలయాన్ని తాత్కాలికంగా వేరే భవనంలోకి తరలించి పాత భవనాన్ని బాగు చేయించాలని ఆదేశించారు. రెవెన్యూ విభాగంలో ఉన్న పలు సెక్షన్లను తనిఖీ చేశారు. ఆమె వెంట జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఏఓ శ్రీకాంత్, తదితరులున్నారు.